క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేత



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన కనక వికాస్, బైండ్ల వినీత్, తిమ్మాపూర్ గ్రామానికి చెందిన అరుణ్ విద్యుత్‌షాక్‌తో మృతి చెందారు. బాధిత కుటుంబాలకు ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మంగళవారం వారికి అందచేశారు. కార్యక్రమంలో కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్, ఎంపీపీ జాజాల భీమేశ్వరి, ట్రాన్స్‌కో ఏడీఈ మనోహర్, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, సర్పంచ్ గంగాధర్, నాయకులు కమటం రమేశ్, దేశెట్టి జీవన్, జాజాల జగన్‌రావు పాల్గొన్నారు.

భాషను బతికించుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

జగిత్యాల: తెలుగు భాషను బతికించుకున్నప్పుడే తెలుగు అస్తిత్వం నిలబడుతుందని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. మంగళవారం మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష ఎంతో గొప్పదని పేర్కొన్నారు. తెలుగు విభాగాధిపతి రాపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంతో మాధుర్యం కలిగిన తెలుగు పదాలు ఎవరూ మరువకూడదని, తెలుగులో ఉన్న గొప్పదనం ఎందులోనూ లేదన్నారు. కార్యక్రమంలో సాఫ్ట్‌క్లబ్ సెక్రటరీ డాక్టర్ సత్యప్రకాశ్, వైస్ ప్రిన్సిపల్ సుల్తానా, హర్‌జ్యోతికౌర్, శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్మయి, జ్యోతిలక్ష్మి, పి.తిరుపతి పాల్గొన్నారు.

క్రీడల్లో నైపుణ్యత సాధించాలి



దొంతాపూర్‌లో క్రీడా పోటీలు

ధర్మపురి: క్రీడల్లో నైపుణ్యతను సాధించాలని ఎంపీపీ, జెడ్పీటీసీ చిట్టిబాబు, బత్తిని అరుణ కోరారు. మండలంలోని దొంతాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని అన్నారు. మొదటి రోజు బాలురు కబడ్డి, ఖోఖో, వాలీబాల్ క్రీడలను నిర్వహించారు. మూడు రోజుల పాటు క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మండల విద్యాధికారి భూమయ్య, మగ్గిడి ప్రిన్సిపాల్ బుచ్చన్న, పీఈటీలు స్వప్న, రాజేందర్ తదితరులున్నారు.

'కేంద్రం నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి'

మెట్‌పల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులతోనే గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టారని కొండ్రికర్ల సర్పంచ్ రాజగంగు,ఉపసర్పంచ్ రాజేశ్వర్ అన్నారు. మండలంలోని కొండ్రికర్లలో మంగళవారం మాట్లాడారు. ఇటీవల కొండ్రికర్లలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన మంత్రి కొప్పుల ఈశ్వర్ రాష్ట్రానికి, ప్రజలకు కేంద్రం చేసిందేమిలేదనడం,ఆయన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. 14,15 వ ఆర్థిక సంఘం నిధుల ద్వారానే గ్రామ పంచాయతీలు నడుస్తున్నాయని తెలిపారు. జనవరి నుంచి రాష్ట్ర ఆర్థిక సంఘం ఇప్పటికీ నిధులు ఇవ్వలేదని మండిపడ్డారు. గ్రామ శివారులోని హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆది శ్రీనివాస్‌ను కలిసిన నాయకులు

మేడిపెల్లి: కాంగ్రెస్ పార్టీ మండల కార్యవర్గం ఇటీవల ఎన్నిక కాగా, మంగళవారం వేములవాడలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆది శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి జిల్లా కార్యవర్గంలో చోటు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఉరుమట్ల లక్ష్మణ్, బీసీసెల్ విభాగం మాదం వినోద్, ప్రధాన కార్యదర్శులు కంటే పోషన్న, సీరటి మల్లేశం పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' కటాక్షం ఎవరికో?

- భారీగా వచ్చిన దరఖాస్తులు
- లబ్ధిదారుల ఎదురుచూపు
- అర్హులకు ఇవ్వాలని పలువురి వినతి



పెగడపల్లిలో దరఖాస్తుదారుల వివరాలు సేకరిస్తున్న అధికారులు

పెగడపల్లి: సొంతింటి కల నెరవేర్చుకోవడానికి గూడులేని నిరుపేదలు ఆశతో ఎదురు చూస్తున్నారు. తొమ్మిదేళ్ల పాలనలో కేసీఆర్ ప్రభుత్వం మొదటిసారిగా 'గృహలక్ష్మి' పథకంలో ఇళ్లు ఇస్తుండటంతో అనేక మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. పెగడపల్లి మండల వ్యాప్తంగా 1256 మంది దరఖాస్తు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తులను అధికారులు సర్వే చేశారు. రేషన్‌కార్డు, కుటుంబ సభ్యుల వివరాలు, వృత్తి, ఆర్థిక స్థితిగతులపై ఆరా తీశారు. ఇంటి నిర్మాణానికి జాగ ఉందా, స్థానికంగా ఉంటున్నారా? కుటుంబ సభ్యుల్లో ఎవరికైన ప్రభుత్వ ఉద్యోగం ఉందా? అన్న అంశాలపై వివరాలు సేకరించారు. వచ్చిన దరఖాస్తుల సర్వే చేసిన అనంతరం 890 మంది దరఖాస్తులు అర్హులుగా గుర్తించారు. రేషన్ కార్డులు, సొంత జాగ లేని వాటితో పాటు ఆర్సీ బిల్డింగ్ ఉన్న 366 దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. అర్హులైన వారి జాబితాను ఆన్‌లైన్ చేసి ఉన్నతాధికారులకు చేరవేస్తున్నారు. అయితే నియోజకవర్గానికి 3 వేలు ఇళ్లు మంజూరు చేయనున్నారు. ఈ లెక్కన పెగడపల్లి మండలానికి మొదటి విడుతలో సుమారు 400 ఇళ్ల వరకు మంజూరు కానున్నాయి. ఈ పథకం కింద రిజర్వేషన్ పద్ధతిలో ఇళ్లను కేటాయించనున్నారు. ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీ మైనార్టీలకు 50 శాతం, ఇతరులకు 20 శాతం, వికలాంగులకు 5 శాతం చొప్పున ప్రభుత్వం ఇవ్వనుంది. అర్హులు ఎక్కువ సంఖ్యలో ఉండటం ఇళ్లు తక్కువ సంఖ్యలో కేటాయించడంతో లబ్ధిదారులు ఆశతో ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరు ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలు లబ్ధిదారుల అవసరాన్ని ఆసరా చేసుకుని తమ సిఫార్సు చేసిన వారికే ఇళ్లు మంజూరవుతాయని ప్రచారం చేసుకుంటూ అందినకాడికి దండుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక నేతలను ప్రసన్నం చేసుకుని వారి ద్వారా లబ్ధిపొందాలని కొందరు తంటాలు పడుతుండగా ఇదే అదనుగా భావించిన నేతలు వారి అనుచరుల పేర్ల జాబితా సిద్ధం చేసే పనిలో ఉన్నారని ప్రజలు ముచ్చటిస్తున్నారు. దీంతో తమకు తొలి విడతలో గృహలక్ష్మి కటాక్షం లభిస్తుందా లేదోననే ఆందోళన నిరుపేదల్లో వ్యక్తమవుతుంది.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి



గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారిలో అధికారులు గుర్తించిన అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి. ప్రభుత్వం ఇళ్లు ఇస్తుందని ఏళ్లనుంచి ఎదురు చూస్తున్నారు. నిరుపేదలను గుర్తించి పార్టీలకతీతంగా ఇళ్లు మంజూరు చేయాలి.

– గోలి మహేందర్‌రెడ్డి సర్పంచ్, నంచర్ల

పేదలను గుర్తించాలి



గృహలక్ష్మి పథకంలో ఇల్లు లేని నిరుపేదలను గుర్తించాలి. ఇళ్ల మంజూరులో పక్షపాతం లేకుండా అర్హులైన వారికి కేటాయించాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అధికారులు నడుచుకోవాలి. పైరవీలకు తావు ఇవ్వకూడదు.

– మమత పెగడపల్లి

నిబంధనల మేరకు ఎంపిక



గృహలక్ష్మి పథకంలో ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్లు కేటాయింపు ఉంటుంది. మండలంలో వచ్చిన దరఖాస్తులన్నింటిపై విచారణ పూర్తిచేశాం. అర్హులను గుర్తించి ఇళ్లు మంజూరు చేస్తారు. దరఖాస్తుదారులు ఎలాంటి అపోహలకు గురికావొద్దు.

– పుల్లయ్య, ఎంపీడీవో, పెగడపల్లి

ఆరోగ్య తెలంగాణ దిశగా అడుగులు

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

మల్యాల: సీఎం కేసీఆర్ పాలనలో ఆరోగ్య తెలంగాణ దిశగా అడుగులు వేస్తున్నామని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మల్యాల మండలం ముత్యంపేటలో ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు ఇస్తున్నామన్నారు. పల్లె దవాఖానలతో పేద ప్రజల ముగింటకు వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి 8 గుంటల స్థలాన్ని అందజేసిన కాసుగంటి నారాయణ రావు కుటుంబ సభ్యులకు సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సామల రేణుక దేవరాజం, ఉప సర్పంచ్ కొండబత్తిని త్రినాథ్, జెడ్పీటీసీ కొండపల్కల రాంమోహన్‌రావు, పాక్స్ చైర్మన్లు సాగర్‌రావు, రాంలింగారెడ్డి, మధుసూదన్‌రావు, కొండగట్టు ఆలయ ధర్మకర్త కొంక నర్సయ్య బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో తెలంగాణ దేశానికే ఆదర్శం

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ అన్నారు. మల్యాల రైతు వేదికలో మంగళవారం 24 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ ఆడబిడ్డలకు సీఎం కేసీఆర్ మేనమామగా మారి రూ.1,00,161 కానుకగా అందిస్తున్నారన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ఆడబిడ్డలకు భరోసానిస్తోందన్నారు. మిషన్ భగీరథ, హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, మిషన్ కాకతీయ, దళితబంధు వంటి పథకాలతో దేశంలోనే తెలంగాణ సంక్షేమ పథకాల అమలులో మొదటి స్థానంలో నిలిచిందన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు న్యాయం



మహిళలతో మాట్లాడుతున్న మేడిపల్లి సత్యం

మల్యాల: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే బలహీన వర్గాలు, రైతులు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని, రానున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని చొప్పదండి కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం అన్నారు. మల్యాల మండలం ముత్యంపేట, దిగువ కొండగట్టులో మంగళవారం గడప గడపకు కాంగ్రెస్‌లో భాగంగా ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టాలన్నారు. ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలు వివరిస్తూ, బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రెండు లక్షలు రుణమాఫీ చేస్తామని, రూ.500లకు సిలిండర్ అందజేస్తామన్నారు. ఎస్సీ ఉప కులాలకు కొత్తగా మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. అంబేద్కర్ అభయ హస్తం పథకం కింద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12లక్షల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఇల్లు లేని ప్రతి నిరుపేదకు ఇంటి నిర్మాణం కోసం రూ.6లక్షల సాయం అందిస్తామని, రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పిస్తామని వివరించారు. బీఆర్‌ఎస్ పార్టీకి గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి, దారం ఆదిరెడ్డి, వీరబత్తిని శోభారాణి, వెల్మ లక్ష్మారెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, గంగాధర్, ముత్యం శంకర్, సతీశ్‌రెడ్డి, లక్ష్మణాచారి, నిరంజన్‌రెడ్డి, కటుకం వినయ్, ఇమామ్, మారుతి, హరినాథ్, హుస్సేన్,పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

'మున్సిపాలిటీలో అవినీతికి తెరలేపారు'

జగిత్యాల: మున్సిపల్‌లో అధికారులు అవినీతికి తెరలేపుతున్నారని 35వ వార్డు కౌన్సిలర్ జయశ్రీ అన్నారు. మంగళవారం జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో మాట్లాడారు. డీజిల్ బిల్లు గతంలో నెలకు రూ.12 లక్షలు రాగా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా విచారణ జరిపి చర్యలు తీసుకోవడంతో రూ.7 లక్షల నుంచి రూ.8.50 లక్షల వరకు డీజిల్ బిల్లు వచ్చిందన్నారు. జూలై నెలలో రూ.11,55,980 వచ్చిందని, ఇందులోనే అవినీతి పాల్పడ్డట్లు తెలుస్తోందన్నారు. శానిటేషన్, వెహికిల్స్ రిపేర్‌కు జూలై వరకు రూ.10 లక్షలు ఖర్చయిందని చెప్పి మళ్లీ అదనంగా ఎజెండాలో పొందుపర్చారని ఆరోపించారు. దశాబ్ది ఉత్సవాల పేరిట ఎలాంటి టెండర్లు లేకుండా ప్రజాధనం దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా బిల్లులు చెల్లించారని ఉన్నతాధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లినట్లు తెలిపారు. గణేశ్ నవరాత్రులు , దసరా ఉత్సవాల కోసం దోపిడీకి పాల్పడుతున్నారని, టవర్ నుంచి మంచినీళ్ల బావి వరకు గుంతలు పూడ్చేందుకు రూ.5 లక్షలు చూపారని, గతంలోనే ఎమ్మెల్యే బీటీ రోడ్డు వేయించారని, మళ్లీ ఇక్కడే ఖర్చు చూపారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు.

భూ సమస్య పరిష్కారానికి జాయింట్ సర్వే

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు కుస్తాపూర్, రత్నాపూర్, మొగిలిపేట, ఒబులాపూర్, సంగెం –శ్రీరాంపూర్ గ్రామాల శివారుల్లోని రెవెన్యూ, అటవీభూమికి సంబంధించి భూ సమస్య పరిష్కారానికి జాయింట్ సర్వే చేయనున్నట్లు ఆర్డీవో మధు, డీఎఫ్‌వో వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మల్లాపూర్ శివారులో రెవెన్యూ, అటవీ అధికారులతో కలిసి భూ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 ఏళ్ల క్రితం ఎస్సారెస్పీ ప్రాజెక్టు నిర్మాణంతో ముంపు గ్రామాలు కుస్తాపూర్, రత్నాపూర్, నడికుడ, సంగెం –శ్రీరాంపూర్ గ్రామాలకు మల్లాపూర్ మండలంలో పునరావాసం కల్పించారని అన్నారు. ఈ క్రమంలో సుమారు 776 ఎకరాలకు పైగా భూమిపై గ్రామాల మధ్య వివాదం ఉందన్నారు. సమస్య పరిష్కారానికి రెవెన్యూ, అటవీ అధికారులతో జాయింట్ సర్వే చేయించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీర్‌సింగ్, ఆర్‌ఐ సురేశ్, ఎఫ్ఆర్వో భూమేశ్, డిప్యూటీ ఆర్వో చంద్రమౌళి, రెవెన్యూ, అటవీ అధికారులు పాల్గొన్నారు.

యాదవుల ఆర్థికాభివృద్ధికి గొర్రెల యూనిట్లు

జగిత్యాలఅగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం యాదవులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు గొర్రెల పథకంతో గొర్రెలు అందజేస్తున్నట్లు డాక్టర్ హిమజ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం ధర్మారంలో రెండో విడత గొర్రెల పంపిణీలో ఆరు యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కర్నూల్ నుంచి వచ్చిన గొర్రెలను లబ్ధిదారులకు అందజేసినట్లు పేర్కొన్నారు. వారందరికీ దశల వారిగా గొర్రెలు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మీపూర్ సబ్‌సెంటర్ వెటర్నరి లైవ్‌స్టాక్ ఆఫీసర్ పూర్ణచందర్, సర్పంచ్ బుర్ర సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీ గిద్దె లక్ష్మి పాల్గొన్నారు.

క్రాప్ దర్పన్ యాప్‌పై రైతులకు అవగాహన

ఇబ్రహీంపట్నం: క్రాప్ దర్పన్ యాప్‌తో పంటల సమస్యలను గుర్తించటం సులభమని ఏఈవో నరేశ్ అన్నారు. మంగళవారం రైతువేదికలో క్రాప్ దర్పన్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించారు. రైతు తన దగ్గర ఉన్న స్మార్ట్ ఫోన్ క్రాప్ దర్పన్‌ను ఉపయోగించి దాని యొక్క సమస్యను కనుగొనవచ్చని తెలిపారు. క్షేత్ర స్థాయి పంట సమస్యను గుర్తించడానికి క్రాప్ దర్పన్ సాధనం రైతుకు మార్గదర్శిగా తోడ్పడుతుందని తెలిపారు. ఈ యాప్‌తో రైతులు వరి, పత్తి పంటలలో వచ్చే రోగాలను, తెగుళ్లను రైతులు సులభంగా గుర్తించి సస్య రక్షణ మార్గాలను తెలుసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.


విద్యార్థులు కష్టపడి చదవాలి

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు కష్టపడి చదవాలని నోముల రంజిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఒడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా నోట్‌పుస్తకాలు, పెన్నులు అందచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నేమూరి లత, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నోముల రంజిత్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎలేటి చిన్నారెడ్డి, లయన్స్ క్లబ్‌సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గ్యాస్ ధరలపై కేంద్ర విధానం సరైంది కాదు'

మెట్‌పల్లి రూరల్: గ్యాస్ సిలిండర్ ధరలను భారీగా పెంచి, తగ్గిస్తున్నట్లు గొప్పలు చెప్పుకోవడం బీజేపీ నాయకులకు అలవాటుగా మారిందని మెట్‌పల్లి ఎంపీపీ మారు సాయిరెడ్డి అన్నారు. మంగళవారం మాట్లాడారు. గ్యాస్ సిలిండర్‌పై రూ.200 తగ్గించాం అని చెప్పుకుంటున్న బీజేపీ నేతలు గతంలో రూ.800 పెంచింది కూడా చెప్పాలన్నారు. బీజేపీ అధికారంలోకి రాకముందు సిలిండర్ ధర రూ.450 ఉండేదని ఆ తర్వాత రూ.1200 పైగా చేసి సామాన్య ప్రజలపై భారం మోపారని మండిపడ్డారు. వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, సర్పంచులు శ్రీధర్, శేఖర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అయ్యా బాంచెన్.. పింఛన్ డబ్బులు వస్తలే



ఎంపీడీవో కార్యాలయంలో వృద్ధురాలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన బెల్లాల గంగు అనే వృద్ధురాలు మంగళవారం మండలపరిషత్ కార్యాలయానికి పింఛన్ డబ్బులు రావడం లేదని వచ్చింది. ఆమె 2 కాళ్లు పనిచేయకపోవడంతో నడవలేని పరిస్థితిలో ఉండగా తన తమ్ముడి సహాయంతో ద్విచక్రవాహనంపై వచ్చి కార్యాలయం లోపలికి పాకుకుంటూ వచ్చి అయ్యా బాంచెన్ నెలకు రూ.3,016 పింఛన్ పెంచినప్పటి నుంచి నాకు రూ. 2 వేల పింఛన్ వస్తుందని సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్ బాబును వేడుకుంది. ఇప్పటికే రెండుసార్లు వచ్చిన గానీ.. అధికారులు పట్టించుకోవడం లేదని వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. ఆన్‌లైన్‌లో పరిశీలించి పై అధికారులు తెలిపి నెలకు రూ. 3,016 పింఛన్ వచ్చేలా చేస్తానని సీనియర్ అసిస్టెంట్ హామీ ఇచ్చారు.

సంక్షేమ,అభివృద్ధి పథకాలతో ప్రజాదరణ

- ఎమ్మెల్యే సంజయ్ కుమార్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సారంగాపూర్: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలతోనే ప్రజల మదిలో బీఆర్ఎస్ పార్టీ నిండిపోయిందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని పోతారం, గణేశ్‌పల్లి గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుబంధు, రైతు బీమా, ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి వంటి పథకాలు రాష్ట్రంలో అమలు చేసిన విధంగా మరెక్కడా అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, సర్పంచ్ డిల్లీ రామారావు, మాజీ సర్పంచ్ తోడేటి శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

రాయికల్: బీఆర్ఎస్‌లో చేరుతున్న ప్రతి కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్ గ్రామానికి చెందిన 30 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలకుర్తి రవి, మాజీ సర్పంచ్ శత్రునాయక్, గ్రామ నాయకులు దుబ్బరాజు, యూత్ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, నాయకులు విజయ్, రమేశ్, పాపయ్య పాల్గొన్నారు.

తిరుమలకు ఎమ్మెల్యే

జగిత్యాల: ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్లనున్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి. రెండు రోజులు అందుబాటులో ఉండరని, ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆర్ఎస్సై కృష్ణ

జగిత్యాలక్రైం: విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించనున్నట్లు ఆర్ఎస్సై కృష్ణ అన్నారు. మంగళవారం ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో ఎస్ఎస్వీ జూనియర్ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, ట్రాఫిక్ గుర్తులు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రోడ్డుపై నడిచేటప్పుడు ట్రాఫిక్ సిగ్నల్స్ పాటిస్తూ రోడ్డుకు ఎడమవైపు నడవాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లకు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమై మరణాలకు దారితీసిన వారి తల్లిదండ్రులు శిక్షార్హులవుతారన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం, ట్రాఫిక్ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ ముసిపట్ల రాజేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ప్రతీ కుటుంబానికి దళితబంధు ఇవ్వాలి

పెగడపల్లి: ప్రతీ ఎస్సీ కుటుంబానికి దళితబంధు కింద సాయం అందించాలని ధర్మపురి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకుడు గజ్జల స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెగడపల్లిలో మంగళవారం మాట్లాడారు. గ్రామానికి ఒకరిద్దరికి దళితబంధు, బీసీలకు రూ. లక్ష ఆర్థిక సాయం అందజేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంటుందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో అన్ని పార్టీలు స్థానికులకే టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ధర్మపురి ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న ఈశ్వర్ ఈ ప్రాంతంలో చేసిన అభివృద్ధి శూన్యమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

మల్లాపూర్: మండల తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన లకావత్ వీర్‌సింగ్‌ను మంగళవారం తెలంగాణ జనసమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్కా కమలాకర్ సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండల ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రావణి, ఆర్ఐలు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

కోరుట్ల: పట్టణంలోని రశ్మీదర్‌తేజ కళాశాలలో కోరుట్ల, మెట్‌పల్లి డివిజన్లలోని తెలుగు, హిందీ ఉపాధ్యాయులకు ఉన్నతి శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హిందీ భాషా ఉన్నతి గీతాన్ని ఎంఈవో గంగుల నరేశం ప్రారంభించారు. శిక్షణా కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు వినియోగించుకుని విద్యార్థులకు భాషా నైపుణ్యాన్ని పెంచాలని సూచించారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ అంబటి వెంకటరాజం, జిల్లా హిందీ రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

రాఖీ కానుకగా గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపు

కోరుట్ల: గ్యాస్ సిలిండర్ ధర తగ్గిస్తూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం ఆడబిడ్డలకు రాఖీ పండగ కానుక అని బీజేపీ పట్టణ అధ్యక్షుడు దాసరి రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ అవసరాలకు గ్యాస్ సిలండర్ ధర రూ.200 తగ్గిస్తూ కేంద్ర తీసుకున్న నిర్ణయం ఆడబిడ్డలకు మోడీ ప్రభుత్వం ఇచ్చిన కానుక అని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల నిరసన

కథలాపూర్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కథలాపూర్ మండలంలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్లను రెగ్యులరైజేషన్ చేయాలని, పనికి తగిన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనం వేళ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపినట్లు అంగన్‌వాడీ టీచర్లు పేర్కొన్నారు.

నేషనల్ లెవల్ కిక్‌బాక్సింగ్‌లో విద్యార్థులకు పతకాలు

రాయికల్: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు జార్ఖండ్‌లో జరిగిన నేషనల్ లెవల్ కిక్ బాక్సింగ్‌లో పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రావు మంగళవారం తెలిపారు. ఈనెల 23, 24, 25 తేదీల్లో జార్ఖండ్‌లోని కిక్‌బాక్సింగ్ పోటీల్లో అండర్ 15 విభాగంలో హార్ట్‌స్టైల్ వెపన్ విభాగంలో సాయి, అగస్త్యన్‌రావు, మనోజ్ వెండి పతకాలు సాధించగా, సాయి, అగస్త్యన్‌రావు కాంస్య పతకాలు సాధించారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

కోరుట్ల రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా మంగళవారం తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి వాసవి మాట్లాడుతూ తెలుగు భాష చాలా గొప్పదని వివరించారు. విద్యార్థులు కమ్మనైన తెలుగు భాష గొప్పతనాన్ని మరువొద్దని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బూర్ల నరేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి డివిజన్‌లో యూరియా కొరత లేకుండా చూడాలని మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మాట్లాడుతూ రైతులకు వారం రోజుల నుంచి యూరియా అందుబాటులో లేదని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల తర్వాత రైతులు పంటలు వేసుకున్నారని ఇప్పటికే పంటలు వేసి నెలరోజులు గడుస్తుందన్నారు. రైతులకు సరిపడా యూరియా లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు తక్షణమే యూరియా అందుబాటులో లభించేలా చర్యలు చేపట్టాలన్నారు.

ముందస్తు రాఖీ వేడుకలు



మల్యాల అల్ఫోర్స్‌లో రాఖీ వేడుకల్లో నరేందర్‌రెడ్డి



రాయికల్‌లో రాఖీ వేడుకల్లో చిన్నారులు



పెగడపల్లి: అంగన్‌వాడీ కేంద్రంలో రాఖీ వేడుకలు

జగిత్యాల/రాయికల్/మల్యాల/మల్లాపూర్/పెగడపల్లి: జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్‌లో, రాయికల్ మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో, విజ్ డమ్ పాఠశాలలో, మల్యాల అడ్డరోడ్డులోని అల్ఫోర్స్ ఎస్ఎస్వీ పాఠశాలలో, వీవీరావుపేట వివేకానంద విద్యాలయంలో మంగళవారం ముందస్తు రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు.